ప్రజాశక్తి
శుక్రవారం 11 అక్టోబర్ 2024
5
విజయనగరం

పైడితల్లమ్మ జాతరకు రండి

సిఎం, మంత్రులను ఆహ్వానించిన శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఈ నెల 14, 15 తేదీల్లో విజయనగరంలో జరిగే పైడితల్లమ్మ జాతరలో పాల్గొనాల్సిందిగా సిఎం చంద్రబాబు నాయుడుతోపాటు కేబినెట్ సహచరులందరినీ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం పైడితల్లమ్మ ఉత్సవాలను రాష్ట్ర పండుగ గుర్తించిన నేపథ్యంలో అధికారికంగా మొదటిసారిగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం సిఎం, మంత్రులకు మంత్రి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఆహ్వాన పత్రికలు అందజేశారు.

సిఎంను ఆహ్వానిస్తున్న మంత్రి శ్రీనివాస్, ఎమ్‌పి, ఎమ్మెల్యే

సుద్దముక్కలకూ నిధుల్లేవ్

- విడుదల కాని పాఠశాల నిధులు
- హెచ్‌ఎంలకు తప్పని అవస్థలు
- మూడేళ్లుగా ఎదురుచూపులు

ప్రభుత్వ విద్యకే పెద్దపీట వేస్తున్నామన్న పాలకుల ప్రకటనలు ఆచరణకొచ్చే సరికి గడప దాటడం లేదు. పాఠశాలలకు నిర్వహణ నిధులను మూడేళ్లుగా ఇవ్వక పోవడమే అందుకు నిదర్శనం. ప్రతి ఏటా విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విడుదల చేయాల్సిన స్కూల్ గ్రాంట్స్‌ను విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఉన్నతాధికారులు మూడేళ్లుగా విడుదల చేయడం లేదు. దీంతో ప్రధానోపాధ్యాయులు సొంత డబ్బుతోనే పాఠశాలలకు కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేస్తున్నారు.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం జిల్లాలో 1799 పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వం విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిర్వహణకు నిధులు విడుదల చేస్తుంది. అందులో 30 మంది వరకు విద్యార్థులుంటే రూ.10 వేలు, 31 నుంచి 100 మంది ఉంటే రూ.25 వేలు, 101 నుంచి 250 మంది ఉంటే రూ.50 వేలు, 251 నుంచి వెయ్యి మంది ఉంటే రూ.75 వేలు, వెయ్యి మందికిపైగా విద్యార్థులు ఉంటే రూ.లక్ష చొప్పున ఏటా విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యాశాఖలోని సమగ్రశిక్ష ద్వారా పాఠశాలలకు నిధులు విడుదల చేసేది. ఈ నిధులతోనే ప్రాధానోపాధ్యాయులు పాఠశాలల్లో ఏదైనా మరమ్మతులు చేయించుకోవడం, కరెంట్ బిల్లులు చెల్లించడం, సుద్దముక్కలు, డస్టర్లు, వైట్ పేపర్లు, చార్టులు, టీచింగ్ ఉపకరణాలు, మరుగుదొడ్ల శుభ్రం చేయడానికి కావాల్సిన సామగ్రి కొనుగోలు చేయాలి. కానీ 2022-23 విద్యా సంవత్సరం నుంచి మూడేళ్లపాటు స్కూల్ గ్రాంట్‌ను విడుదల చేయలేదని ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. దీంతో ప్రధానోపాధ్యాయులు సొంత డబ్బుతో పాఠశాలలకు కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేస్తున్నారు. పాఠశాలలకు సంబంధించిన కరెంట్ బిల్లులను చెల్లించకూడదని గత విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. కానీ అందుకు ఎలాంటి ఉత్తర్వులూ జారీ చేయకపోవడంతో విద్యుత్తు శాఖ సిబ్బంది ప్రతి నెలా పాఠశాలలకు వచ్చి కరెంట్ బిల్లు తీసి, చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని పలువురు ప్రధానోపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిఇఒ, ఎపిసి, డివైఇఒ, ఎంఇఒలు పాఠశాలల తనిఖీలకు వచ్చినప్పుడు.. 'ఫ్యాన్లు, లైట్లు ఎందుకు పనిచేయడం లేదు. చిన్న చిన్న మరమ్మతులు ఎందుకు చేయించుకోవడం లేద'ంటూ తమను ప్రశ్నిస్తున్నారని వాపోతున్నారు. స్కూల్ గ్రాంట్ రావడం లేదని చెబితే ఏమాత్రమూ పట్టించుకోవడం లేదని చెబుతున్నారు.

ఇప్పటికైనా విద్యాశాఖ, సమగ్రశిక్ష ఉన్నతాధికారులు స్పందించి గత రెండేళ్ల బకాయిలతోపాటు ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠశాల నిధులు కూడా వెంటనే విడుదల చేయాలని, కరెంట్ బిల్లులు చెల్లింపులపైనా స్పష్టత ఇవ్వాలని ప్రధానోపాధ్యాయులు కోరుతున్నారు. ఈ సమస్య ఒక్క విజయనగరం జిల్లాలోనే కాదు... రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ వెంటాడుతోంది. దీనిపై విద్యాశాఖ, సమగ్రశిక్ష ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారన్నది వేచిచూడాల్సిందే.

మా జేబులో డబ్బులు ఖర్చు చేస్తున్నాం

పాఠశాలలకు స్కూల్ గ్రాంట్ రాక సొంత డబ్బులతోనే సామగ్రిని కొనుగోలు చేయాల్సి వస్తోంది. పాఠశాలల్లో చిన్న చిన్న మరమ్మతులు కావాల్సిన మెటీరియల్, ఇతర టీచింగ్ సామగ్రిని ప్రధానోపాధ్యాయులు సొంత డబ్బుతో కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పాఠశాల నిధులు విడుదల చేయాలి.

-డి.రాము, ప్రధానోపాధ్యాయులు, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, కాపుశంభాం

వెంటనే విడుదల చేయాలి

ప్రస్తుత విద్యా సంవత్సరంతో కలిసి మూడేళ్లుగా ప్రభుత్వం పాఠశాల నిధులను విడుదల చేయలేదు. కానీ పాఠశాలల్లో కార్యక్రమాలు, వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు ఇవ్వాలని చెబుతున్నారు. దీంతో హెచ్‌ఎంలు సొంత డబ్బుతో కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం అయినా పాఠశాల నిధులను వెంటనే విడుదల చేయాలి.

- పి.సన్యాసిరాజు, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

కొబ్బరి రైతుల సమస్యలపై ఉద్యమం

ఎపి కొబ్బరిరైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.శ్రీనివాస్

మాట్లాడుతున్న ఎపి కొబ్బరిరైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.శ్రీనివాస్

ప్రజాశక్తి-పూసపాటిరేగ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొబ్బరి రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.శ్రీనివాస్ అన్నారు. కొబ్బరి రైతుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమమే మార్గమని స్పష్టంచేశారు. గురువారం మండలంలోని గోవిందపురంలో గీతా మందిర్ కళ్యాణ మండపంలో ఎపి కొబ్బరి రైతుల సంఘం (ఎపి రైతుసంఘం అనుబంధం) ఆధ్వర్యంలో కొబ్బరి రైతుల జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఎం.ఎరకయ్య దొర అధ్యక్షత వహించారు. కొబ్బరి రైతుల సమస్యలపై చర్చించి తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ విజయనగరం ప్రాంతంలో కొబ్బరి బొండం ఎక్కువగా మార్కెటింగ్ జరుగుతుందని, రైతుకు రూ.12 నుంచి 15 మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. అదే వ్యాపారులు ఒక్కో బొండం రూ.30కు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారని చెప్పారు. వ్యాపారుల మోసాలు అరికట్టి కొబ్బరి బొండానికి రైతుకు 25 రూపాయలు వచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కొబ్బరి తెగుళ్ల నివారణకు ఉద్యాన శాఖ ద్వారా సామూహిక నివారణ చర్యలు చేపట్టాలన్నారు. కొబ్బరి పంట విస్తరణకు సబ్సిడీలు అందించాలని తెలిపారు. పంటల బీమా ప్రతి కొబ్బరి చెట్టుకు అమలు చేయాలని, అందుకు తగిన బీమా పథకం తీసుకురావాలని డిమాండ్ చేశారు.

సదస్సులో కోయర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి మొంగం శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి వి.జగన్నాథం, పైడితల్లమ్మ కొబ్బరి ఉత్పత్తిదారుల సంఘం కార్యదర్శి పి.అప్పడుదొర మాట్లాడుతూ కొబ్బరి రైతులు సమస్యలు పరిష్కారం కోసం సంఘటితం కావాలని కోరారు. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు కొబ్బరి రైతుల సమస్యలపై తీర్మానం ప్రవేశపెట్టారు. జిల్లాలో 30 వేల ఎకరాలలో కొబ్బరి సాగు అవుతుందని చెప్పారు. ఇటీవల కొబ్బరి పిందెలు రాలిపోతున్నాయని, దిగుబడులు తగ్గిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యాన శాఖ అధికారులు వెంటనే స్పందించి శాస్త్రవేత్తల బృందంతో అధ్యయనం చేయించాలని కోరారు. కొబ్బరి రైతులకు డ్రిప్ సౌకర్యం 90 శాతం సబ్సిడీతో అందించాలని, నాణ్యమైన కొబ్బరి మొక్కలను రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. సదస్సులో సిఐటియు జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ, రైతు సంఘం నాయకులు కృష్ణారెడ్డి తదితరులు మాట్లాడారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన కొబ్బరి రైతులు సదస్సులో పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రతిఒక్కరూ మానసిక ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.విజయకళ్యాణి అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కళ్యాణ ఆనంద భారతి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో గురువారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మానసిక రోగుల పట్ల వివక్షత తగదని, అందరితో సమానంగా న్యాయపరమైన హక్కులన్నీ కలిగి ఉంటారని వివరించారు. భవిత సెంటర్‌లో చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మానసిక వైకల్యం కలిగిన పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సక్రమంగా అందుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. సదరం సర్టిఫికెట్ల గురించి వారికి వివరించారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ డాక్టర్ ఎస్.వి.రమణ తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

3 గంటలకే సిరిమానోత్సవం

పకడ్బందీగా సాగునీటి సంఘాల ఎన్నికలు • ఆర్‌ఒల సమావేశంలో కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవాన్ని 15వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశామని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చెప్పారు. అధికారులంతా తమకు అప్పగించిన బాధ్యతలను కచ్చితంగా, నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులతో కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో అమ్మవారి సిరిమానోత్సవం, విజయనగరం ఉత్సవాలు, సాగు నీటి సంఘాల ఎన్నికలు, నీటి తీరువా వసూలు, రేషన్ డీలర్ల రేషనలైజేషన్, పౌర సరఫరాలు, స్వీప్ కార్యక్రమం, ధాన్యం సేకరణ, ఇ-క్రాప్ తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్‌తో కలిసి కలెక్టర్ సమీక్షించారు. ప్రజలు ఇబ్బంది పడకుండా మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభించి సాయంత్రం 5 గంటలకు ముగించేలా ప్రణాళికను రూపొందించామని చెప్పారు. దీనిని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. విఐపిల దర్శనాలకు కూడా నిర్ణీత సమయాన్ని కేటాయించనున్నట్లు తెలిపారు.

నీటితీరువా బకాయిలు సుమారు రూ.14 కోట్లు ఉందని, దీనిపై దృష్టిపెట్టి ఈ నెలాఖరులోగా పూర్తిగా వసూలు చేయాలని తహశీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. నవంబరు నుంచి జమాబందీ నిర్వహించాలని సూచించారు. సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ ఈ నెల 16 నుంచి ప్రారంభం అవుతుందని, ఎన్నికల షెడ్యూల్ ప్రకారం, నిబంధనల మేరకు పక్కాగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించే 13 మంది తహశీల్దార్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. రేషన్ డీలర్ల రేషనలైజేషన్, ఖాళీల భర్తీ ప్రక్రియను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తొలుత వివిధ అంశాలపై జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ సుదీర్ఘంగా సమీక్షించారు. ధాన్యం సేకరణ ప్రక్రియ కోసం చేయాల్సిన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. తగ్గింపు ధరలపై టమాటా, నిత్యావసరాల పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో ఇసుక కొరత రాకుండా 15న కొత్తగా రెండు రీచ్‌లను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. చీపురుపల్లిలో ఇసుక స్టాక్ పాయింట్‌ను ప్రారంభిస్తామన్నారు.

సమావేశంలో డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, ఎస్‌డిసిలు ప్రమీల, మురళీకృష్ణ, జోసెఫ్, సుధారాణి, ఆర్‌డిఒలు డి.కీర్తి, బి.వెంకట సత్యవాణి, విఎస్ఎస్ రామ్మోహన్, వ్యవసాయ శాఖ జెడి విటి రామారావు, డిఎస్‌ఒ మధుసూదనరావు, డిఎం మీనాకుమారి, ఇరిగేషన్ ఇఇ వెంకటరమణ, తహశీల్దార్లు, డిటిలు పాల్గొన్నారు.

అందరి సహకారంతో పండగకు ఏర్పాట్లు

స్టాండింగ్ కమిటీ సమావేశంలో మేయర్ విజయలక్ష్మి

సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అందరి సహకారంతో పైడితల్లమ్మ జాతర, విజయనగర ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మేయర్ వెంపడాపు విజయలక్ష్మి తెలిపారు. గురువారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పొందుపరిచిన 9 అంశాలతో పాటు టేబుల్ అజెండాగా పొందుపరిచిన 5 అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌వివి రాజేష్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే ప్రతి పనికీ మేయర్ అనుమతి తప్పనిసరి అన్నారు. ప్రోటోకాల్ ప్రకారం అధికారులు సభ్యులకు గౌరవం ఇవ్వాలన్నారు. మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ పండగల నేపథ్యంలో నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు రూ.50 లక్షలతో పెయింటింగ్ పనులు చేపడుతున్నామన్నారు. సమావేశంలో కమిషనర్ పి.నల్లనయ్య, సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు అల్లు చాణక్య, జివి రంగారావు, రేగాన రూపాదేవి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

23న నర్సింగ్ అసోసియేషన్‌కు ఎన్నికలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎపి నర్సింగ్ అసోసియేషన్ విజయనగరం యూనిట్‌కు ఈ నెల 23న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రిజ్వాన్ షరీఫ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరణకు విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయ నోటీసు బోర్డులో వివరాలను ఉంచినట్లు తెలిపారు. ఇప్పటికే ఎన్నికలపై అవగాహన కల్పించామని చెప్పారు. అసోసియేషన్‌కు ఈ నెల 14న ఎలక్షన్ నోటీసు ఇవ్వనున్నట్లు తెలిపారు. 16న నామినేషన్ల స్వీకరణ, 17న పరిశీలన, 18న నామినేషన్ల ఉపసంహరణ, 23న ఓటింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

'ఏరు దాటకముందు ఓడ మల్లన్న... ఏరు దాటాక బోడి మల్లన్న' అన్న చందంగా ఉంది పాలకుల తీరు. జామి అగ్రహారం భూముల సమస్యపై అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు సైతం అదే వైఖరి అవలంబిస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో ఓట్ల కోసం ప్రతి సమస్యను పరిష్కరిస్తామని హామీలు గుప్పించడం ఆనవాయితీగా మారింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజుల ఉత్సవాలు చేసుకున్నారు తప్ప ఒకరంటే ఒక్కరూ కూడా జామి అగ్రహార భూముల సమస్యపై మాట్లాడిన పాపాన పోలేదని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అగ్రహారం భూముల కథ కంచికేనా అంటే... అవుననే సమాధానం వస్తోంది.

అగ్రహారం కథ కంచికేనా?

- నోటిఫికేషన్‌కే పరిమితమైన దశాబ్దాల నాటి సమస్య
- కూటమి ప్రభుత్వంలోనూ అదేతీరు
- ఆందోళనలో అగ్రహారం రైతులు

ప్రజాశక్తి - జామి

మండల కేంద్రమైన జామి అగ్రహారం భూముల సమస్య తాతల తండ్రుల కాలం నుంచి రైతులను ముప్పతిప్పలు పెడుతోంది. కళ్లముందు భూములు ఉన్నా ఎటువంటి హక్కులూ లేకపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. పాలకులు మారుతున్నారు తప్ప అగ్రహారం భూముల సమస్య మాత్రం నెరవేరడం లేదు. ఈ నేపథ్యంలోనే 2023 మే 27న భూములకు అప్పటి తహశీల్దార్ పబ్లిక్ నోటిఫికేషన్ వేసి అన్నదాతల్లో ఆశలు రేపారు. తాతముత్తాతల కాలం నుంచి సాగు చేస్తున్న భూములను ఇనాం వాటా కింద 1/3 షేర్ కేటాయించిన అధికారులపై రైతులు మండిపడినా, ఇప్పటికైనా భూసమస్య పరిష్కారానికి నోచుకుంటుందని ఆశపడ్డారు. నోటిఫికేషన్‌లోని ఉన్న అనేక తప్పులు తడకలు ఉన్నప్పటికీ సమస్య పరిష్కారం కోసం ప్రశ్నించకుండా అధికారులకు సహకరించాలని భావించారు. తమ భూములపై అభ్యంతరాలను అధికారుల సూచనల మేరకు అందజేశారు. ఈ ప్రక్రియ జరిగి సుమారుగా ఏడాదిపైన కావస్తున్నా... అగ్రహారంపై ఎటువంటి అడుగులూ ముందుకు పడలేదు. ఎన్నికల ప్రచారంలో సమస్యను పరిష్కరిస్తానని స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి హామీ ఇచ్చినప్పటికీ, ఇంత వరకు దానిపై ఒక్కసారైనా స్పందించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతమంది పాలకులు మారినా .. సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దశాబ్దాలుగా చిన్నచూపే

జామి మండల కేంద్రంలో సుమారుగా 2600 ఎకరాల వరకు ఇనాం భూములు (అగ్రహారం) ఉన్నాయి. వీటికి హక్కులు కల్పించాలని రైతులు ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. 2009లో భూ సర్వే ప్రారంభమై, 2023 మే 27న అప్పటి తహశీల్దార్ నోటిఫికేషన్ విడుదల చేశారు. 30 రోజుల్లో నోటీసులో పొందుపర్చిన వివరాలపై అభ్యంతరాలు తెలపాలని పేర్కొన్నారు. అంతుపట్టని పలు అంశాలు నోటిఫికేషన్‌లో రావడంతో అప్పట్లో రైతులు గందరగోళానికి గురయ్యారు. ప్రధానంగా నోటిఫికేషన్‌లో ఇనాం దారుడి పేరు రాయకుండానే వాటా కింద 1/3 షేర్ భూమిని కేటాయించడం గందరగోళాన్ని సృష్టించింది. అగ్రహారం భూమిలో కేవలం 2049 ఎకరాలకు మాత్రమే నోటిఫికేషన్ వేయడం, మిగులు భూముల వివరాలు, వాటి పరిస్థితిని పొందుపర్చలేదన్న ప్రశ్నలు అనేకం వెల్లువెత్తాయి. వీటితో పాటు ఇనాందారుల కొనుక్కొని రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు, తహశీల్దార్ కార్యాలయం నుంచి 300కు పైగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందినవారు, వీటితో పాటు గ్రీన్‌ఫీల్డ్ హైవే భూసేకరణలో నష్టపోయిన రైతుల వివరాలు నోటిఫికేషన్‌లో ఎక్కడా కనిపించలేదు. అయినా, అధికారులు చెప్పిన మాటలకు కట్టుబడి నోటిఫికేషన్ ప్రక్రియ ముందుకు సాగాలని రైతులు భావించారు. కానీ సుమారుగా ఏడాదిన్నర కావస్తున్నా నోటిఫికేషన్ ప్రక్రియ ముందుకు సాగలేదు.

అగ్రహారం చెరువులకు పాసుపుస్తకాలు

సాధారణ రైతు ఏళ్లుగా భూములు సాగుచేసుకుని హక్కుల కోసం ఎదురు చూస్తున్న నేపథ్యంలో అక్రమార్కులకు మాత్రం చెరువులకు సైతం పాసుపుస్తకాలు ఇచ్చేసిన పరిస్థితి నెలకొంది. ఒకవైపు ఇరిగేషన్ అధికారులు చెరువు ఆక్రమణలో ఉంది, ఆక్రమణ తొలగించి చెరువుకు సరిహద్దులు గుర్తించాలని అధికారులకు అనేక మార్లు లేఖలు పంపినా పట్టించుకోని పరిస్థితి దాపురించింది. ఈ నేపథ్యంలోనే కొంతమంది పెద్దలు న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు అగ్రహారం భూముల సమస్యపై మాత్రం రైతుల్లో ఆందోళన రోజురోజుకు పెరుగుతోంది. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వంపై స్థానిక నాయకులు ఇప్పటికైనా ఒత్తిడి తెచ్చి, సామాన్య రైతులకు న్యాయం చేస్తారని కోరుతున్నారు. మరి ఏమేరకు తెలుగు తమ్ముళ్లు అగ్రహారం భూముల విషయంలో అడుగులు వేస్తారో వేచి చూడాలి మరి.

టాటా మరణం తీరని లోటు

విచారం వ్యక్తంచేసిన మంత్రి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరంకోట

రతన్ టాటా మరణం పారిశ్రామిక రంగానికి, ఈ దేశానికి తీరనిలోటని చిన్నతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో విచారం వ్యక్తంచేశారు. ఈ దేశం గొప్ప మానవతావాది కోల్పోయిందని తెలిపారు. పారిశ్రామిక శిఖరం విలువలకు నిలువుటద్దం రతన్ టాటా అని, ఎంత ఎదిగినా ఒదిగి ఉండటం ఆయన నైజమని తెలిపారు. టాటా జీవితం ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు.

వార్డు పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వార్డు పర్యటనలో భాగంగా గురువారం నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు వివిధ విభాగాల అధికారులు 12వ డివిజన్‌లో పర్యటించారు. ఇప్పిలివీధి జంక్షన్ నుంచి ప్రారంభమైన వార్డు పర్యటన వివిధ ప్రాంతాలలో సాగింది. స్థానికుల సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చొరవ చూపుతామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రేగాన రూపాదేవి, ఎఇ సీతారామ్మూర్తి పాల్గొన్నారు.

వలస కుటుంబంలో తీవ్ర విషాదం

కుప్పకూలిపోయి మహిళ మృతి

తల్లి మృతదేహం వద్ద నిస్సహాయ స్థితిలో ఉన్న చిన్నారులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో గురువారం సాయంత్రం తీవ్ర విషాదకర సంఘటన చోటుచేసుకుంది. అకస్మాత్తుగా కుప్పకూలిపోయి ఓ వలస కూలీ మరణించింది. పోలీసుల కథనం ప్రకారం...

ఒడిశాలోని జైపూర్ జిల్లా కుంద్ర గ్రామానికి చెందిన బొర్లం, తోన(35) దంపతులు. అదే గ్రామానికి చెందిన మరికొన్ని కుటుంబాలతో వారు పిల్లలతో సహా అనకాపల్లి జిల్లా కశింకోటలో ఇటుక బట్టీల్లో పనికోసం వలస వచ్చారు. గురువారం వారంతా స్వస్థలానికి వెళ్లేందుకు కశింకోట నుంచి బయల్దేరి విజయనగరం కాంప్లెక్సుకు చేరుకున్నారు. అక్కడి నుంచి రైల్వేస్టేషన్‌కు వెళుతుండగా మార్గం మధ్యలో తోన అకస్మాత్తుగా కుప్పకూలిపోయింది. ఆమె భర్త బొర్లం, తోటి కూలీలు ఎంత ప్రయత్నించినా తోన లేవలేదు. దీంతో స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ లక్ష్మీ ప్రసన్నకుమార్ అక్కడికి చేరుకున్నారు. కొన ఊపిరి ఉండటంతో అంబులెన్స్‌ను రప్పించి జిల్లా కేంద్రాస్పత్రికి ఆమెను తరలించారు. ఆమె అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. తోన కుమార్తెలు బొర్నా (ఐదేళ్లు), కళావతి (మూడేళ్లు) ఏం జరిగిందో తెలియక, నిస్సహాయక స్థితిలో తల్లి వైపు చూస్తూ అమ్మా.. అమ్మా.. అని పిలవడంతో అక్కడున్న వారిని కలచివేసింది. ఆమె మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లేందుకు స్థానికులు కొంత మొత్తాన్ని తోన భర్తకు అందజేశారు.

బట్టలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే


బట్టలు పంపిణీచేస్తున్న లలితకుమారి, గొంప కృష్ణ

వేపాడ: మండలంలోని అరిగిపాలెం గ్రామంలో ఆర్యే విద్యాసంస్థ ఏర్పాటు చేసిన బట్టల పంపిణీ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ పాల్గొని బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి మహిళా అధ్యక్షులు గుమ్మడి భారతి, వేపాడ మండల టిడిపి కార్యదర్శ సభ్యులు, అరిగిపాలెం గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి

సంతకవిటి: యువత మత్తుకు దూరంగా ఉండాలని, గంజాయి వంటి వాటి జోలికి పోకూడదని రాజాం రూరల్ సిఐ హెచ్.ఉపేంద్ర రావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం సంకల్పం కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై యువతకు ఆయన అవగాహన కల్పించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు క్రయ విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే గంజాయిపై గట్టి నిఘా ఉంచామన్నారు. అనంతరం యువతకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ గోపాలరావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్కావెంజర్ ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

పూసపాటిరేగ : మండల పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో స్కావెంజర్ ఉద్యోగానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఇఒ బి.పాపినాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పూసపాటిరేగ కెజిబివిలో ఖాళీగా ఉన్న ఒక్క స్కావెంజర్ ఉద్యోగాన్ని పొరుగు సేవల (అవుట్‌సోర్సింగ్) ప్రాతిపదికన నియమిస్తారన్నారు. వయోపరిమితి ఓపెన్ క్యాటగిరి అభ్యర్థులకు 42 ఏళ్ళు కాగా, బిసి, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు 5 సంవత్సరాలు, వికలాంగులకు 10 సంవత్సరాలు సడలింపు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ స్కావెంజర్ ఉద్యోగానికి అర్హులైన, ఆసక్తి ఉన్న మహిళ అభ్యర్థులు ఈనెల 15వ తేదీలోగా మండల విద్యాశాఖ కార్యాలయానికి దరఖాస్తులు అందజేయాలని ఎంఇఒ కోరారు.

ప్లాంటు నిర్మాణ స్థలం పరిశీలన

స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

నెల్లిమర్ల: మండలంలోని సారిపల్లి ఇండస్ట్రియల్ ఏరియా సమీపంలో గల నెల్లిమర్ల నగర పంచాయతీకి సంబంధించిన లెగసి వేస్ట్ ట్రీట్మెంటు ప్లాంటు నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని తరుణి ఏజెన్సీతో కలసి నగర పంచాయతీ కమీషనరు కె.అప్పలరాజు గురువారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.ఉమా భాస్కర్, ఎఇ త్రినాధ్, ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్య పరిష్కారానికి సోషలిజమే మార్గం

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

సోషలిస్టు సమాజంతోనే నిరుద్యోగ సమస్య పరిష్కారం అవుతుందని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు అన్నారు. గురువారం స్థానిక ఎల్‌బిజి భవన్‌లో యువజన, విద్యార్థి శాఖా మహాసభను నిర్వహించారు. తొలుత సిపిఎం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మోడీ పాలనలో రాజ్యాంగం దెబ్బతింటోందని, అందుకు నిదర్శనం కొత్త న్యాయచట్టాలేనని తెలిపారు. విద్య, ఉద్యోగ కల్పనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిపెట్టడం లేదన్నారు. ప్రజా సమస్యలకు పోరాటాలే మార్గమన్నారు.

నారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

నారాయణకు ఘన నివాళి

విజయనగరం టౌన్ : యుటిఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి నాగటి నారాయణ వర్థంతి సభను గురువారం జెడ్‌పి మినిస్టీరియల్ హాల్లో యుటిఎఫ్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ చిత్రపటానికి యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు డి.రాములు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నారాయణ ఆశయ సాధనకు పనిచేయాలని వక్తలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, ఐక్య ఉపాధ్యాయ పత్రిక కమిటి కన్వీనర్ కె.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శులు సత్యనారాయణ, కె.ప్రసాదరావు, పి.వాసుదేవరావు, రాజారావు, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎ.శంకరరావు, సిపిఎస్ సబ్‌కమిటీ కన్వీనర్ పి.రాంప్రసాద్, డి.సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గంజాయి కేసులో ఆరుగురు అరెస్టు

గుర్ల: గంజాయి కేసులో 6గురు నిందితులను అరెస్టు చేసినట్లు చీపురుపల్లి డిఎస్‌పి ఎస్ రాఘవులు తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన గుర్ల పోలీసు స్టేషన్‌లో కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గంజాయి కలిగి ఉన్న, విక్రయిస్తున్న 6గురు వ్యక్తులను చీపురుపల్లి సిఐ శంకరరావు, గుర్ల ఎస్ఐ నారాయణరావులు ముందస్తు సమాచారంతో మండలంలో ఎస్‌ఎస్‌ఆర్‌పేట సమీపంలో చంపావతి పరివాహక ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న, కలిగివున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.4వేల విలువగల 2కిలోల గంజాయి, 5 సెల్ ఫోన్లు, రూ.1250 నగదును స్వాధీనం చేసుకున్నారు. అరకు మండలం సుంకరి మట్టకు చెందిన మజ్జి అప్పన్న, జామి మండలం, అలమండ గ్రామానికి చెందిన దాసరి గాంధీ కలిసి ఎస్-ఎస్‌ఆర్‌పేట గ్రామంలో గల చంపావతి నదీ పరివాహక ప్రాంతంలో, కొంతమంది వ్యక్తులకు గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అమ్మిన ఇద్దరితో పాటు గంజాయి కొనుగోలు చేస్తున్న విజయనగరం సుంకరి వీధికి చెందిన తాడ్డి సాయి కళ్యాణ్, తోటపాలెంకు చెందిన కిలాడ శ్యామియాల్ విద్యాసాగర్, తోటపాలెం, బాబామెట్టకు చెందిన చింతలూరి తేజేశ్వరావు, శివాలయం వీధికి చెందిన అలజంగి జోషఫ్‌లను కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని డిఎస్‌పి తెలిపారు. ఈ కేసులో క్రియాశీలకంగా పని చేసిన చీపురుపల్లి సిఐ జి.శంకరావు, గుర్ల ఎస్ఐ నారాయణరావు, పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు.

వ్యక్తి ఆత్మహత్యయత్నం

భోగాపురం : ఆర్థిక లావాదేవీల కారణంగా భోగాపురం గ్రామానికి చెందిన తిరుమ రెడ్డి మురళి (48) గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పరిస్థితి విషమంచడంతో విజయనగరంలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలపై లేఖ రాసినట్లు చెబుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

కాపర్ తీగెలు దొంగిలించిన ఇద్దరు అరెస్టు

రామభద్రపురం: మండల పరిధిలోని ఆరికతోట, నాయుడువలస, కొట్టక్కి గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లలో ఉన్న కాపర్ తీగెలు అపహరించుకుపోయిన ఇద్దరు నిందితులను గుర్తించి అరెస్టు చేశామని బొబ్బిలి డిఎస్‌పి శ్రీనివాసరావు తెలిపారు. ఆరికతోటలో సెప్టెంబర్ 14న తాగునీటికి సరఫరాకు ఉపయోగిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ చోరీ జరిగినట్టు సర్పంచ్ పెంకి పుష్పమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. గతేడాది నాయుడువలస, కొట్టక్కి గ్రామాల్లో కూడా ఇటువంటి తరహా దొంగతనాలు జరగడంతో వీటిపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ తరహా దొంగ తనాలకు పాల్పడే వ్యక్తుల కదలికలు తెలుసుకొని గురువారం ఆరికతోట వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న విజయనగరం కంటోన్మెంట్ ప్రాంత వాసులు జున్నీ రాంసింగ్, హరదీప్ సింగ్‌లను అదుపులోకి తీసుకొని విచారించగా నేరాలను అంగీకరించారన్నారు. వీరు పంజాబ్‌కు చెందినప్పటికీ గత కొన్నేళ్లుగా విజయనగరంలోనే నివాసం ఉంటున్నారన్నారు. వీరిపై ఇప్పటికే జిల్లాలో 14 ట్రాన్స్‌ఫార్మర్ చోరీ కేసులు ఉన్నాయన్నారు. వీరి వద్ద నుంచి సుమారు 70 కిలోల కాపర్ వైరు, నేరానికి ఉపయోగపడే వస్తువులను స్వాధీనం చేసుకొని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో బొబ్బిలి రూరల్ సీఐ కె. నారాయణరావు, ఎస్ఐ వి.ప్రసాద్, ఏఎస్ఐ అప్పారావు, పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

పంచాయతీల అభివృద్ధిలో వార్డు సభ్యులు భాగస్వామ్యం ముఖ్యమని జిల్లా పరిషత్ సిఇఒ బి.వి.సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వార్డు సభ్యులు, ఉప సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి విడుదలైన నిధులు అభివృద్ధి పనులకు ఏవిధంగా ఖర్చు చేయాలో సర్పంచ్‌తో కలిసి వార్డు సభ్యులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రతి ఒక్క పని దారి తనంగా ఉండేటట్లు చూసే బాధ్యత తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రవికుమార్, ఇఒపిఆర్‌డి భాస్కరరావు, వార్డు సభ్యులు, ఉప సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు మెంబర్లకు గత రెండు రోజులుగా ఇస్తున్న శిక్షణ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధిలో ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు కీలక పాత్ర పోషించాలన్నారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి ఎస్.రవికుమార్, ఎపిఒ ఆదిలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: మాట్లాడుతున్న జెడ్‌పి సిఇఒ సత్యనారాయణ

వార్డు సభ్యులవతారమెత్తిన సిబ్బంది

రామభద్రపురం: పంచాయతీల బలోపేతానికి వార్డు సభ్యులకు ఇస్తున్న శిక్షణ తరగతుల రెండో రోజు వార్డు సభ్యుల హాజరు అంతంత మాత్రమే ఉండడంతో మండల పరిషత్ సిబ్బంది వారి స్థానాల్లో కూర్చుని శిక్షణ తరగతుల ఆకళింపు చేసుకొని పలువురిని ఆశ్చర్యానికి గురి చేశారు. కొన్ని పంచాయతీల వార్డు సభ్యుల ప్రతినిధులు రావడం గమనార్హం. 22 పంచాయతీల నుంచి ఇద్దరు చొప్పున హాజరు కావలసి ఉండగా అంతా కలిపి 14 మంది లోపే హాజరయ్యారు. గ్రామ పంచాయతీ పరిపాలనలో గ్రామ వార్డు సభ్యులు కూడా భాగస్వామ్యం కావాలని ఇఒపిఆర్‌డి ఎ.వెంకటరమణ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిపాలనలో పది అంశాలపై స్పష్టత ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ బంగార్రాజు, శ్రీను, రవి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

రామభద్రపురం: జాతీయస్థాయిలో నిర్వహించే క్రీడా పోటీలకు మండల పరిధిలోని కొట్టక్కి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన రొంగలి మౌనిక ఎంపికయినట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు బొత్స రత్నకిశోర్ తెలిపారు. ఇటీవల జరిగిన అండర్-19 సాఫ్ట్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ బాలిక పాల్గొని మంచి ప్రతిభ కనబర్చడంతో జాతీయ స్థాయి జట్టులో చోటు కల్పించినట్లు వెల్లడించారు. గుజరాత్‌లో జరగనున్న జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజయనగరం జిల్లా తరఫున మౌనిక పాల్గొంటుందన్నారు. ఆమె తండ్రి రొంగలి తిరుపతిరావు ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. వెనుకబడిన ప్రాంతానికి చెందిన బాలిక సాఫ్ట్ బాల్ క్రీడల్లో ప్రత్యేక ప్రతిభ కనబరచడం పట్ల పాఠశాల హెచ్‌ఎం రావాడ భాస్కరరావు, జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి పి.కృష్ణ, జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతి, సర్పంచ్ అనూరాధ, మౌనికకు అభినందనలు తెలిపారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొత్తవలస

రాష్ట్రాన్ని హరితంద్రప్రదేశ్‌గా తీర్చి దిద్దడానికి మనమంతా కృషి చేసి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పిలుపు నిచ్చారు. గురువారం లక్కవరపుకోటలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే రైతులకు 10వేల మునగ మొక్కలను సరఫరా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కల్ని నాటి పర్యావరణానికి ఊపిరి పోసి కాలుష్యాన్ని తరిమికొట్టాలన్నారు. నియోజకవర్గంలో గణనీయంగా పచ్చతనం, అటవీ విస్తీర్ణాలు పెంపుదల లక్ష్యంగా వన మహోత్సవం నిర్వహిస్తున్నామని అన్నారు. కాలుష్య నివారణకు కూటమి ప్రభుత్వం వన మహోత్సవం కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షించాలని ప్రతిజ్ఞ చేశారు. వివిధ రకాల అవసరాల పేరుతో చెట్లను విచ్చలవిడిగా కొట్టేయడంతో వాయు కాలుష్యం పెరిగిందని అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్.కోట మాజీ జెడ్‌పిటిసి కరెడ్ల ఈశ్వరరావు, మాజీ ఎంపిపి కొల్లి రమణమూర్తి, సర్పంచ్ కెర్రు పార్వతి, పుట్టా శ్రీను, మల్ల రామకృష్ణ, జీఎస్‌నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

మొక్కలను నాటుతున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

మానసిక ఆరోగ్యంతోనే అభివృద్ధి

ప్రజాశక్తి- బొబ్బిలి

మానసిక ఆరోగ్యంతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందగలమని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ అన్నారు. మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గురువారం ప్రభుత్వ ఆసుపత్రిలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం బాగుంటే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందవచ్చునని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు మానసిక ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని వైద్యులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ జి.శశిభూషణరావు, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మండలంలోని సతివాడ పిహెచ్‌సిలో వైద్యులు సాయిరామ్ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా క్లినికల్ సైకాలజిస్ట్ రాజు మానసిక రోగులకు తనిఖీలు నిర్వహించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నర్సు మంగమ్మ, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు, దేవి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్జి అరుణశ్రీ

రాజకీయ తొలగింపులు ఆపాలని 21న ధర్నా

ప్రజాశక్తి- రేగిడి

పాఠశాలల్లో ఆయాలకు, మధ్యాహ్న భోజన కార్మికులకు, గ్రీన్ అంబాసిడర్లకు బకాయి జీతాలు తక్షణమే చెల్లించి రాజకీయ తొలగింపులు ఆపాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఏ. జగన్మోహన్‌రావు డిమాండ్ చేశారు. గురువారం ఉంగరాడ మెట్ట వద్ద సిఐటియు మండల నాయకులు ఎం. త్రినాధ్ అధ్యక్షతన నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిరు ఉద్యోగులు, కార్మికులపై రాజకీయ కక్ష సాధింపులు, తొలగింపులు ఆపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆర్ ఆమదాలవలసలో స్కూల్ ఆయాను, మరి కొన్ని చోట్ల మధ్యాహ్న భోజన కార్మికులను రాజకీయ కారణాలతోనే తొలగించారని గుర్తు చేశారు. చాలా పంచాయతీల్లో డబ్బులు లేవని గ్రీన్ అంబాసిడర్లని నిలిపివేశారని వెల్లడించారు. వారందరినీ తిరిగి విధుల్లోకి తీసుకొని 3 నెలల బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాజకీయ వేదింపులు, తొలగింపు లు ఆపాలని కోరుతూ స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అధికారులు సానుకూలంగా స్పందించాలని లేదంటే అక్టోబరు 21న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పోరెడ్డి విశ్వనాథం, మండల నాయకులు పెంటయ్య, ముద్దులమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు

మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం

ప్రజాశక్తి- గుర్ల

గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎంపిపి పొట్నూరు ప్రమీల అన్నారు. గురువారం పాలవలస గ్రామంలో ఉపాధి హామీ, మండల పరిషత్ నిధులు సుమారు రూ.8 లక్షలతో సిసి రోడ్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ రహదారులు, తాగునీరు, పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. గ్రామాల్లో ప్రజలు కూడా తమవంతు బాధ్యతగా అభివృద్ధి పనులకు సహకారాన్ని అందించాలన్నారు. వైసిపి జిల్లా కార్యవర్గ సభ్యులు పొట్నూరు సన్యాసినాయుడు మాట్లాడుతూ గ్రామంలో ప్రతి వీధిలో సీసీ కాలువలు, సిసి రోడ్లు వేస్తామన్నారు. గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వల్లూరు రాము, వైసిపి సీనియర్ నాయకులు బుర్లె శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ పెద్ద అచ్చంనాయుడు, పెనుమజ్జ అప్పలనాయుడు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిపి ప్రమీల

గౌరీశ్వరరావుకు రైతునేస్తం పురస్కారం

ప్రజాశక్తి- రాజాం, రేగిడి

20న మాజీ ఉపరాష్ట్రపతి చేతులమీదుగా అందజేత

రాజాం గ్రామానికి చెందిన పెంకి గౌరీశ్వరరావు రైతు నేస్తం పురస్కారానికి ఎంపికయ్యాడు. ఈ నెల 20న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతులు మీదుగా గన్నవరం దగ్గర ఆత్కూరు స్వర్ణ భారతి ట్రస్టులో ఈ అవార్డును అందుకోనున్నారు. గౌరీశ్వరరావు ఉద్యోగ విరమణ అనంతరం వంగర మండలంలోని కొత్తవలస గ్రామ పరిదిలో గత పదేల్లుగా రసాయనాల జోలికి పోకుండా కుటుంబ సభ్యుల సహకారంతో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. రెండు ఎకరాల మాగానీలో దేశవాళీ వరి పెసలు, మినుములు, నువ్వులు, అంతర పంటలు మిశ్రమ పంటలు పచ్చిరొట్ట ఎరువులతో రాజీలేని సూత్రాలు పాటించి పండిసున్నారు. 4 ఎకరాల మెట్టబూమిలో మామిడి జీడి తోటలు అదే పద్దతిలో పండిస్తున్నారు. రైతులు అధిక దిగుబడులు కోసం విచక్షణా రహితంగా అవసరం లేకున్నా అధిక రసాయనాలు వాడి పురుగు మందులు గుమ్మ రించి మితిమీరిన పెట్టుబడులతో పంట గిట్టు బాటు కాక రోజుకు 2వేల మంది రైతులు కాడిమేడి వదలి పట్టణాలకు వలస పోయి కూలి పనులు వెతుక్కుంటూంటే గౌరీశ్వర రావు కాడి మేడి పట్టి పొలం బాట పట్టారు. గతపదేల్లుగా ప్రకృతి వ్యవసాయంలో సొంత అనుభవంతో నిరంతరం వ్యవసాయంపై మెలకువలను తెలుసుకుని పంటలలో అదిక దిగుబడుల కోసం శాస్త్రీయ విధానాలు తెలుసుకుని రసాయన పంటలకు దీటుగా పండిస్తున్నారు. ఇటీవల హైదరాబాదు నుంచి పౌండేషన్ బృందం గౌరీశ్వరరావు పంటలను నిశితంగా పరిశీలించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు రైతు గౌరీశ్వర రావు ప్రజాశక్తికి తెలిపారు. తోటపల్లి జట్టు ట్రస్ట్ వ్యవస్థాపక అద్యక్షులు డాక్టర్ డొల్లు పారినాయుడు, రైతు నేస్తం ఎడిటర్ యడ్లపల్లి వేంకటేశ్వరరావు, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధి కొత్త సాయి ప్రశాంత్ కుమార్, అవార్డు గ్రహీత వెంకి చైతన్య కుమార్ గౌరీశ్వరరావును అభినందించారు.

యాప్‌ను ప్రారంభిస్తున్న కర్రోతు బంగార్రాజు

సభ్యత్వ నమోదును ప్రారంభించిన కర్రోతు

ప్రజాశక్తి - భోగాపురం

తెలుగుదేశం పార్టీ క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా పైలట్ ప్రాజెక్ట్ క్రింద నెల్లిమర్ల నియోజకవర్గాన్ని ఎంపిక చేశారు. మండలంలోని పోలిపల్లి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ ఇంఛార్జి, ఎపి మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, పార్లమెంట్ పార్టీ ఉపాధ్యక్షులు ఆకిరి ప్రసాద్‌రావు, తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి కర్రోతు రాజు, నాయకులు మామిడి బాలకృష్ణ, సిరివూరి మౌళివర్మ తదితరులు పాల్గొన్నారు.

నందిగాంలో గ్రామసందర్శన

నందిగాం గ్రామపంచాయతీలో జరిగిన గ్రామ సందర్శన కార్యక్రమంలో బంగార్రాజు పాల్గొన్నారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కిరణ్ కుమార్, సర్పంచ్ గరే మురళి, నాయకులు గరే వెంకటరమణ తదితర నాయకులు పాల్గొన్నారు.

రతన్ టాటాకు ఘన నివాళి

ప్రజాశక్తి- బొబ్బిలి

పాతబొబ్బిలిలో ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటాకు కౌన్సిలర్ చోడిగంజి రమేష్ నాయుడు, గ్రామ పెద్దలు పి.లక్ష్మణరావు, ఎం.రమాదేవి నివాళులర్పించారు. మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల సమావేశం నిర్వహించారు. రతన్ టాటా సేవలను కొనియాడి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నివాళి

పారిశ్రామికవేత్త రతన్ టాటా మృతి పారిశ్రామిక అభివృద్ధికి తీరని నష్టమని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్ జెసి రాజు, పూర్వ అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక గాంధీ బొమ్మ వద్ద గురువారం రతన్ టాటా మృతికి కొవ్వొత్తులతో సంతాపం తెలిపారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

రతన్ టాటా మరణం దేశానికి తీరని లోటు

ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా మరణం దిగ్భ్రాంతికి గురిచేసిందని మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. దేశ పారిశ్రామిక అభివృద్ధిలో రతన్ టాటా కీలకపాత్ర పోషించారన్నారు. పరిశ్రమలు స్థాపించి దేశాభివృద్ధికి పని చేయడంతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారని చెప్పారు. రతన్ టాటా మరణం దేశానికి తీరని లోటన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పారిశ్రామిక రంగానికి తీరని లోటు

రాజాం: రతన్ టాటా మృతి దేశ పారిశ్రామిక రంగానికి తీరనిలోటని ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్ ఒక ప్రకటనలో తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. దేశ ప్రజల హృదయాల్లో చెరగని ముద్రవేసిన గొప్ప వ్యాపారవేత్త, నిరాడంబరతకు నిలువెత్తు నిదర్శనం అని అన్నారు. విలువలతో కూడిన వ్యాపారం చేస్తూ వ్యాపారం అంటే కేవలం ఆదాయం మాత్రమే కాదని అభిమానం ఆత్మీయత అని నిరూపించిచారన్నారు.

వికలాంగుల సేవలో ముందుండాలి

జూనియర్ సివిల్ జడ్జి విజయచందర్

ప్రజాశక్తి - కొత్తవలస

వికలాంగుల సేవలో ప్రతి ఒక్కరూ ముందుండాలని, వికలాంగుల సేవలో పాల్గొనే అవకాశం కొంతమందికె ఉంటుందని మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జ్ డాక్టర్ ఎస్.విజయచందర్ అన్నారు. గురువారం స్థానిక ఆంజనేయ పేటలో ఉన్న చైతన్య మానసిక వికలాంగుల ఆశ్రమంలో మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇటువంటి వికలాంగ పిల్లలకు సేవ చేయడం చాలా అదృష్టమని ఆ అవకాశం కొంతమందికే దక్కుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి సంస్థను నడిపించడం చాలా కష్టమని, ఇటువంటి పిల్లలకు సేవ చేస్తున్న సంస్థ వ్యవస్థాపకులు బొజంకి సన్యాసిరావుని అభినందించారు. మంచి మానసిక ఆరోగ్యం ప్రయోజనాలు కేవలం వ్యక్తులకే కాకుండా కుటుంబాలు, సంఘాలు, సమాజాలకు కూడా ఉపయోగపడతాయన్నారు. నలుగురిలో ఒకరు తమ జీవితంలో ఏదో ఒక సమయంలో మానసిక ఆరోగ్య సమస్యను ఎదుర్కొంటారని ప్రత్యేకంగా తెలియజేశారు. అనంతరం సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలు, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా ఇటువంటి పిల్లలకు సేవలు చేస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు బొజంకి సన్యాసిరావు, న్యాయవాదులు డి. శ్రీనివాస్, జి.ఎస్. నాయుడు, జి. వెంకటరమణ, గవర కృష్ణ, ఎన్. శ్రీరాంమూర్తి, పి.ఎస్.ఆర్. ప్రసాద్ ఆర్. కృష్ణంనాయుడు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం

కొత్తవలస: సుబ్బలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెందుర్తి లోయలా వృద్ధాశ్రమంలో 120 మందికి, కొత్తవలస మండలం కోటపాడు రోడ్డులో ఉన్న చైతన్య బధిరల పాఠశాలలో 45 మంది మానసిక వికలాంగులకు, బలిగట్టం దగ్గర ఉన్న న్యూహోప్ అనాధ ఆశ్రమంలో 40 మంది పిల్లలకు అన్నదానం చేశారు. ప్రవసా భారతీయులు డి.విజయలక్ష్మి. వి.సునీత, తనూజ, ఆర్థిక సహాయం అందజేశారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు కనకాల శివ, విరోతి శివాజీ, జామి సూరిబాబు, పాల్గొన్నారు.

కల్తీ చేస్తే చర్యలు

బొబ్బిలి: పెట్రోల్, డీజిల్‌లో కల్తీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కె.రామ్‌కుమార్ అన్నారు. స్థానిక కోర్టు జంక్షన్‌లో ఉన్న హెచ్.పి పెట్రోల్ బంకును గురువారం తనిఖీ చేసి పెట్రోల్, డీజిల్ నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్‌లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినియోగదారులకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్ ఇవ్వాలని, కొలతలలో పారదర్శకత పాటించాలని కోరారు.

IN THE HONOURABLE COURT OF THE IInd ADDITIONAL DISTRICT JUDGE COM MACT AT SRIKAKULAM
M.V.O.P No.207/2021

Between:-
Sri Kemburu Papinaidu ----Petitioner
And:- **Sri Kalisetti Satyam @ Satyanarayana & 2 others** ----Respondents
To,
R-1: Sri Kalisetti Satyam @ Satyanarayana, S/o late Ramunaidu, aged 66 years, Driver of lorry, residing at Garividi village and Mandal, Vizianagaram District
R-2: Sri K.Govinda, S/o Sanyasappalanaidu, aged 40 years, Hindu, Owner of lorry, residing at Garividi village and Mandal, Vizianagaram District

Please take this notice in the above matter, that the above matter is posted to 22-10-2024 for your appearance. You are here by directed to appear before the above court **at 10.30 A.M On 22-10-2024** in person or through advocate without fail. Otherwise the matter will be decided in your absence.

// పై కోర్టు ఉత్తర్వుల ప్రకారం //
ఎం. అన్నంనాయుడు
న్యాయవాది,
శ్రీకాకుళం, సెల్: 9441619887.

మహారాజశ్రీ బొబ్బిలి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టువారి దివ్యసముఖమునకు.
I.A.121/2020 in O.S.44/2018

బిట్వీన్ :
వంజిరాపు అరుణజ్యోతమ్మ వగైరాలు
.... పిటిషనర్లు/వాదులు
ఎండ్ :
వంజిరాపు ధనుంజయ విశ్వేశ్వరరావు వగైరాలు
.......రెస్పాండెంట్లు/ప్రతివాదులు
R5: వంజిరాపు వనజాక్షి భర్త లేటు ధనుంజయ విశ్వేశ్వరరావు, వయస్సు 40 సం॥లు, వంజరాంపేట గ్రామం, బలిజిపేట మండలం, విజయనగరం జిల్లా
R6: వంజిరాపు సిద్విలాసిని తండ్రి లేటు ధనుంజయ విశ్వేశ్వరరావు, వయస్సు 6 సం॥లు వంజరాంపేట గ్రామం, బలిజిపేట మండలం, విజయనగరం జిల్లా
R7: వంజిరాపు భువనేశ్వరరావు తండ్రి లేటు ధనుంజయ విశ్వేశ్వరరావు, వయస్సు 4 సం॥లు వంజరాంపేట గ్రామం, బలిజిపేట మండలం, విజయనగరం జిల్లా
R6 and R7 Being Minor reptd by its Natural Guardian 5th Respondent.

పై నెంబరు దావాలో యిందలి పిటిషనరు/ప్రతివాదిల పై డిక్లరేషన్ దావా దాఖలు చేసియున్నాను. దరిమిలా ఐ.ఎ. 121/2020 Orde 22, Rule 4 అను ఎల్.ఆర్.పిటిషనులో 5 టు 7 రెస్పాండెంట్లకు **తేది.16-10-2024**కి వాయిదా అయి యున్నది. సదరు వాయిదా దినం పై కోర్టులో **ఉదయం 10-30గం॥**లకు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరుకావలయును లేని యెడల మీపరోక్షమందు తీర్మాణించబడునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

(బై ఆర్డర్)
కండాపు ప్రసాదరావు
పిటిషనర్ వాది తరుపు వకీలు, బొబ్బిలి.
బొబ్బిలి,
తేది.10-10-2024